క్లుప్తంగా

వెలిగిన వీధి దీపాలు



సాక్షి స్పందన

సంగెం : మండలంలోని గవిచర్లలో మంగళవారం వీధి దీపాలు వెలిగాయి. గ్రామంలోని వరంగల్–నెక్కొండ ప్రధాన రహదారితోపాటుగా పలు వాడల్లో వీధి దీపాలు వెలగని విషయమై 'వీధి దీపాలు వెగలక వెతలు' శీర్షికతో 'సాక్షి'లో ఈనెల 23న ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి కిరణ్ స్పందించారు. వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు. అనంతరం అన్ని వీధి దీపాలు వెలుగుతుండడాన్ని నిర్ధారించుకున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా చొరవ చూపిందంటూ 'సాక్షి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

'పీజీటీ మ్యాథ్స్'కు దరఖాస్తుల ఆహ్వానం

చెన్నారావుపేట : మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో పీజీటీ మాథ్స్ సబ్జెక్ట్ బోధించేందుకు ఎమ్మెస్సీ, బీఈడీ పూర్తి చేసిన నిరుద్యోగుల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్న లక్ష్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన నిరుద్యోగులు ఈనెల 28న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు 29న ఇంటర్వ్యూ, డెమో నిర్వహించి ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థి 9, 10వ తరగతులతోపాటు ఇంటర్ విద్యార్థులకు బోధించాల్సి ఉంటుందని తెలిపారు.

ఆర్థికసాయం



గీసుకొండ : స్థానిక ఎంపీటీసీ దౌడు కోమల భర్త, కాంగ్రెస్ నాయకుడు భరత్ తండ్రి సూరయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆ పార్టీ జిల్లా నాయకుడు, సమాజ సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి మంగళవారం రూ.5 వేల సాయం అందజేశారు. అలాగే మచ్చాపూర్‌కు చెందిన సిరికొండ సూరయ్య కుటుంబానికి రూ.3 వేలు పంపించారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన నగదును బాధితులకు ఆ పార్టీ సీనియర్ నాయకుడు అల్లం మర్రెడ్డి, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, వీరగోని రాజ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, రుద్రప్రసాద్, మాదాసి రాంబాబు, రవీందర్, కూసం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నగదు, బియ్యం..



నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన వేముల వైకుంఠం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి మటన్ షాపు నిర్వాహకుడు ఎల్లావుల కుమార్ యాదవ్ మంగళవారం రూ.3 వేల నగదు, బియ్యం అందజేశారు. తొలుత వైకుంఠం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వేముల రామ్మూర్తి, రాజశేఖర్, రాజు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ నగర పరిధిలోని ధర్మారం గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ గట్టికొప్పుల రాంబాబును, అతడి సోదరుడు రమేశ్‌ను వారి తల్లి ఎల్లమ్మ ఇటీవల మృతి చెందిన సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి మంగళవారం పరామర్శించారు. తొలుత ఎల్లమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, కుసుమ సతీశ్, రాదారపు శివకుమార్, ముల్క ప్రసాద్, కంది క్రాంతికుమార్, ఆరె కుమార్, సుంకరి రాజు తదితరులున్నారు.

40వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులు

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లో బల్దియా అధికారుల ఆధ్వర్యంలో ప్రధాన డ్రెయినేజీలో పేరుకుపోయిన వ్యర్థాలను మంగళవారం తొలగించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, జవాన్ ప్రశాంత్, వీరమల్లయ్య, అశోక్, మల్లయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ'ల్లో నత్తనడకన అభివృద్ధి



లెంకాలపల్లి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న కార్మికులు

నల్లబెల్లి : మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో తలపెట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్న దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అసహనం వ్యక్తమవుతోంది. మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలుగా గుర్తించింది. వీటిల్లో 1739 మంది విద్యార్థులు ఉండగా వారిలో 810 మంది బాలురు, 929 మంది బాలికలు. సదరు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.1.09 కోట్లు మంజూరు చేసింది. పనుల నిర్వహణను గ్రామాఖ్య సంఘాలకు అప్పగించింది. పనులు చేపట్టేందుకు అడ్వాన్సుగా రూ.27.73 లక్షలను అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్‌లకు అందజేశారు. ఆయా పాఠశాలల్లో ఈనెల 10 నాటికే పనులు పూర్తి చేయాల్సి ఉండగా నేటికి పనులు పూర్తి కాలేదు.

అసంపూర్తిగా పనులు..

మండలంలోని పలు పాఠశాలల్లో కిటికీలు, తలుపులు బిగించలేదు. ఫ్లోరింగ్ పనులు కూడా పూర్తి కాలేదు. పాఠశాలలకు నీటి సరఫరా చేసే ట్యాంకులు బిగించలేదు. మరుగుదొడ్ల మరమ్మతులు కూడా పూర్తి చేయలేదు.

తల్లిదండ్రుల్లో అసహనం

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించే పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు గడువు ముగిసి 15 రోజులు కావస్తున్నా పూర్తి కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులను గ్రామ సమాఖ్యలకు అప్పగించినట్లు చెబుతున్నా వాస్తవానికి ఆయా గ్రామాల్లో కాంట్రాక్టర్లే చేయిస్తున్నట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే పనులు పూర్తి చేయడంలో ఆలస్యం జరుగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా పనులు త్వరగా పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలో పనులు పూర్తి చేయిస్తాం



అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పర్యవేక్షిస్తున్నాం. ఇప్పటికే 50 శాతం పూర్తి అయ్యాయి. మిగతా పనులు త్వరలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

-శ్రీనివాసరావు, ఎంఎన్ఓ, నల్లబెల్లి

'కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం'



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

నర్సంపేట రూరల్ : కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ తెలిపారు. నర్సంపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం మొదలై నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం పెట్టుబడుల కోసం రైతుబంధు సాయం అందించడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ప్రభుత్వ మోసపూరిత విధానంతో రైతులు విత్తనాలు, ఎరువులు కొనలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు మార్లు రైతుబంధు ఇవ్వకుండా రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత విధానాలను రైతులు గమనించాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ బాధ్యులు మోతె జయపాల్‌రెడ్డి, నాయకులు మోతె పద్మనాభరెడ్డి, కోమండ్ల గోపాల్‌రెడ్డి, కట్ల సుదర్శన్ రెడ్డి, కొడారి రవి, మోటూరి రవి, తాళ్లపెల్లి రాంప్రసాద్, భూక్య వీరన్న, కడారి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పెన్షన్ రికవరీలో నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రాజమౌళి

నర్సంపేట : నర్సంపేటలోని వివేకానంద కాలనీకి చెందిన ఓ మహిళ కొంత కాలంగా తీసుకుంటున్న నకిలీ పెన్షన్‌ను రికవరీ చేయడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంసీపీఐ(యూ) డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి తెలిపారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది మేలోనే నకిలీ పెన్షన్ తీసుకుంటున్నట్టు నిర్ధారణ అయినా అధికారులు నోటీసులతో సరిపెడుతూ కాలయాపన చేస్తున్నారని చెప్పారు. పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీఏ కింద వివరణ కోరగా సరైన సమాధానం ఇవ్వడం లేదన్నారు. రికవరీ చేయకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. సమావేశంలో ఖానాపురం, చెన్నారావుపేట మండలాల కార్యదర్శులు కలకోట్ల యాదగిరి, జన్ను రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరిహారం అందజేత



పరిహారం డబ్బు ఇస్తున్న అధ్యక్షుడు, తదితరులు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని కాకతీయ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు నర్ర మోహన్‌రెడ్డి కొద్ది రోజుల క్రితం మృతి చెందగా అతడి భార్య రాజక్కకు రూ.1,29,728 బీమా పరిహారాన్ని అధ్యక్షుడు నంగునూరి సాంబయ్య మంగళవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మోహన్‌రెడ్డి మృతి బాధాకరమన్నారు. సభ్యులకు కార్యవర్గం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పుచ్చ స్వామి, డైరెక్టర్లు కాసిడి అజయ్‌రెడ్డి, పెండ్యాల గిరి, కొత్తపల్లి రాజు, కాసు అయిలుమల్లు, కొండబత్తుల నర్సింహరాములు, పెండెం శ్రీనివాస్, అకౌంటెంట్ గుండెబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సదుపాయాలు కల్పించాలి





డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, యూఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారణ్యపురి: ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్య తీసుకోవాలని సూచించారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహరావు మాట్లాడుతూ రకరకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. నర్సయ్య, రాజ్‌కుమార్, ఉదయ్, రమేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలి

జిల్లాలో అనుమతిలేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, అలాగే విద్యను వ్యాపారం చేస్తున్న స్కూళ్ల గుర్తింపును రద్దుచేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోతు రాజేష్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని అనుమతి లేకుండా నడుపుతున్న పాఠశాలల వివరాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో స్కూల్ యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ విక్రయించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి బాలగోని రాకేష్, నాయకులు మహేష్, రాజేష్, వెంకటేష్, రంజిత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అస్తిపంజరం లభ్యం

దామెర : మండల కేంద్రంలోని పెద్దగుట్టపై అస్తిపంజరం లభ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వంగ మల్లయ్య (70) 2020లో భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబీకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా సోమవారం మల్లయ్య మనువడు వంగ కిరణ్ గొర్లను మేపేందుకు పెద్దగుట్టపైకి వెళ్లగా అక్కడ అస్తిపంజరం, దాని పక్కన ఉన్న గీతల స్వెటర్ మరియు లుంగీ, చెప్పులను గమనించి కుటుంబ సభ్యులకు, పోలీస్‌లకు సమాచారం ఇచ్చాడు. అస్తిపంజరం వంగ మల్లయ్యదిగా నిర్ధారించారు.

నేటి నుంచి పశువులకు ఎల్ఎస్‌డీ టీకాలు

సంగెం: మండలంలోని పశువులకు ముద్ద చర్మ వ్యాధి (లంపి స్కిన్ వ్యాధి) నివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ వల్లె రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (26న) తిమ్మాపూర్, 27న కొత్తగూడెం, 28న కుంటపల్లి, 29 సంగెం, జూన్ 1న చింతలపల్లి, 2న కృష్ణానగర్, 3న ఎల్గూర్ రంగంపేట, 4న నర్సానగర్, 5న ఎల్గూర్ స్టేషన్, బీకోజీనాయక్ తండా, 6న మొండ్రాయి, ముమ్మడివరం, గొల్లపల్లి, 8న నార్లవాయి, 9న నల్లబెల్లి, బాలునాయక్‌తండా, 10న వీఆర్ఎన్ తండా, పల్లారుగూడ, 11న పోచమ్మతండా, 12న గాంధీనగర్, 13న తీగరాజులపల్లి, సోమ్లాతండాలో వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాడి రైతులు పశువులకు ఎల్ఎస్‌డీ వ్యాధి నివారణ టీకాలు వేయించాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

సంగెం : రేపు (గురువారం) మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎంపీపీ కళావతి అధ్యక్షత వహిస్తారని, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. మండల అధికారులు సమగ్ర నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

మాజీ కోఆప్షన్ సభ్యుడి మృతి



యాకూబ్ (ఫైల్)

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లికి చెందిన మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త ఎర్ర యాకూబ్ (65) అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతితో విషాదం నెలకొంది. యాకూబ్ మృతదేహానికి పలువురు నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు..



నర్సంపేట రూరల్ : విద్యుదాఘాతానికి గురై దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన నర్సంపేట మండలంలోని ఆకులతండాలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆకులతండాకు చెందిన కన్నెబోయిన సుధాకర్‌కు చెందిన దుక్కిటెద్దు మేత మేస్తూ గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. తనకు సుమారు రూ.70 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడి

గంగారం : గుడుంబా స్థావరాలపై దాడి చేసి 120 లీటర్ల చక్కర పానకం ధ్వంసం చేసి 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవి కుమార్ తెలిపారు. మండలంలోని జంగాలపల్లిలో గుడుంబా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించగా 120 లీటర్ల చక్కర పానకం లభ్యం కాగా వెంటనే ధ్వంసం చేసి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ నిషేధిత గుడుంబా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌ను వినియోగించుకోవాలి

దామెర : మండలంలోని విద్యార్థులు క్రీడా పాఠశాలలను వినియోగించుకోవాలని ఎంపీపీ కాగితాల శంకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మండల స్థాయి క్రీడాకారుల ఎంపికలు మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీపీ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు...క్రీడా పాఠశాలల్లో ప్రవేశం పొంది రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంఈఓ రమాదేవి, నోడల్ అధికారి జుమ్మా మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులు రాష్ట్రంలోని హకీంపేట్, హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్‌లో ఉన్న క్రీడ పాఠశాలలల్లో ప్రవేశం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఎంపీడీఓ కల్పన, ఎంపీఓ రంగాచారి, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రుక్మిణీదేవి, ఫిజికల్ డైరెక్టర్ దేవేందర్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, లక్ష్మణ్, మండల కేంద్రంతో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

రాయపర్తి (వర్ధన్నపేట) : కల్యాణలక్ష్మి, తదితర సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు తెలిపారు. వర్ధన్నపేటలోని తన క్యాంప్ కార్యాలయంలో వర్ధన్నపేట, పర్వతగిరి, ఐనవోలు, ఖిలా వరంగల్ మండలాలకు చెందిన 63 మంది లబ్ధిదారులకు మంగళవారం ఆయన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా ప్రయోజనకర పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. పేదలకు మరింత లబ్ధి చేకూర్చే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికాయుతంగా కార్యాచరణ చేపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ, తహసీల్దార్లు విజయసాగర్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో భాగంగా రుణమాఫీ

● ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య



మాట్లాడుతున్న నరుకుడు వెంకటయ్య

రాయపర్తి (వర్ధన్నపేట) : ఎన్నికలకు ముందు ప్రకటించిన హామీల అమలులో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీకి చర్యలు చేపట్టిందని ఆ పార్టీ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య తెలిపారు. వర్ధన్నపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని చెప్పారు. తెలంగాణలోని రైతుల కళ్లల్లో ఆనందం చూసేందుకే రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీని అమలు చేస్తోందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవు పలిపారు. సమావేశంలో పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు చెరుపల్లి బాబు, నాయకులు బంగారు సదానందం, ఎర్ర శ్రీకాంత్, శివరాత్రి వెంకటనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఊరచెరువులో అక్రమ తవ్వకాలు

● ఐబీ ఏఈ ఫిర్యాదు.. టిప్పర్ స్వాధీనం



చెరువులో మొరం తోడుతున్న హిటాచీ

సంగెం : మండలంలోని లోహిత ఊరచెరువులో అక్రమంగా నల్లరేగడి, మొరం తవ్వకాలు చేపడుతున్న క్రమంలో ఐబీ ఏఈ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెరువు నుంచి మంగళవారం హిటాచి, టిప్పర్ల ద్వారా నల్లరేగడి, మొరం తరలిస్తుండగా స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. దీంతో రెవెన్యూ, ఐబీ అధికారులు, పోలీసులు దాడి చేసి టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరో హిటాచీ, టిప్పర్ మరమ్మతులకు గురి కాగా అక్కడే వదిలేశారు. సుమారు 15–20 ఫీట్ల లోతుతో భారీ గుంతలు తవ్వి మొరం తీస్తుండడంతో చెరువులో నీరు నిల్వ ఉండదంటూ స్థానికులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతి లేకుండా తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఐబీ ఏఈ హమీద్ ఫిర్యాదులో పోలీసులను కోరారు.

డంపింగ్ యార్డుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

పర్వతగిరి : మండల కేంద్రంలో ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డును మార్చే దిశలో భాగంగా బైరన్‌కుంట వద్ద ఉన్న పర్వతాల శివాలయ గుట్ట వెనుక ఉన్న స్థలాన్ని అధికారులతో కలిసి ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. డంపింగ్ యార్డు కోసం నిర్ణయించిన స్థలం వరకు దారి ఏర్పాటు కోసం తలపెట్టిన పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రఘు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రిక్షా కార్మికుడికి గాయాలు

నల్లబెల్లి : రోడ్డు ప్రమాదంలో రిక్షా కార్మికుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని నారక్కపేటలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. నారక్కపేటకు చెందిన శనిగరం శంకర్ నర్సంపేటలో రిక్షా కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శంకర్ కిరాణ షాపులో సరుకులు కొనుగోలు చేసి వెళ్తుండగా రుద్రగూడెం నుంచి నర్సంపేట దిశగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. దీంతో శంకర్‌కు తీవ్ర గాయాలు కాగా కుటుంబ సభ్యులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యులు శంకర్‌ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శంకర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది.

వలసవ్యాపారికి..

రాయపర్తి (వర్ధన్నపేట) : రోడ్డు ప్రమాదంలో వలస వ్యాపారికి గాయాలైన ఘటన వర్ధన్నపేట శివారులో చోటు చేసుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన వలస వ్యాపారి ధినేశ్ నారాయణ తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ప్రమాదవశాత్తు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ధినేశ్ నారాయణకు తీవ్ర గాయాలు కాగా సమాచారం అందుకున్న స్థానిక ఏసీపీ నర్సయ్య, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకుని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సత్వరమే స్పందించడం చర్చనీయాంశంగా మారింది. పోలీసుల చొరవను స్థానికులు అభినందించారు.

చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

గూడూరు: మండలంలోని భూపతిపేట, మర్రిమిట్ట, వెంగంపేట బీట్ పరిధిలోని 1037 కంపార్ట్‌మెంట్‌లో ఇటీవల అక్రమంగా ఫారెస్ట్‌లో చెట్లను నరికించిన పోలీసు ఉన్నతాధికారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కట్ల నరేందర్‌రెడ్డి, బొడ్డు కిరణ్, గ్రామస్తులు డిమాండ్ చేశారు. వెంగంపేట గ్రామంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ పాలనలోనే లైన్ తండాకు చెందిన పోలీసు ఉన్నతాధికారిగా గుర్తింపు పొందిన వ్యక్తి మండల ఫారెస్టు, రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తన పేర ఆర్ఓఎఫ్ఆర్ పత్రాలు సృష్టించాడని ఆరోపించారు. ఆ భూమి ఫారెస్టుదేనని గతంలో అధికారులు ఆక్రమించుకొని పలు రకాల మొక్కలు పెంచుతుండగా, తిరిగి ఆ అధికారి ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడం దారుణమన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి, ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు సాయిలు, యాకస్వామి, వెంకటయ్య పాల్గొన్నారు.